సాక్షి
సంగారెడ్డి
గురువారం ၊ 25 ၊ జనవరి ၊ 2024



సరిహద్దు దాటుతున్న బియ్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా సరి హద్దులను దాటిస్తున్నారు. వివరాలు 8లో ▸



ఓటు.. శాసించూ

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వివరాలు 8లో ▸



పశుపోషణ పెనుభారం

గిరిపుత్రులకు పశుపోషణ భారంగా మారింది. గ్రాసం దొరకక జీవాలు గోస తీస్తున్నాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నకిలీ ఓట్లు తొలగించండి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: ఓటరు జాబితాలో ఉన్న నకిలీ ఓట్లను తొలగించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. బుధ వారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ దేవు జాకు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బొల్లారం, పాశమైలవరం, ఇస్నా పూర్, రామచంద్రపురం, పారిశ్రామికవాడలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు కూడా ఇక్కడ ఓటు హక్కు కలిగి ఉన్నారని, వారిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, రాధాకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తా



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి కొత్తగూడెంలో బీటీ రోడ్డు, లక్మా తం డాలో బీటీ రోడ్డు, సికింద్రాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, తాగునీటి ట్యాంకు, కొన్యాల నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ సమస్యల పరిష్కారానికి అధికారుల సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులు తీసు కొస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం పీపీ నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, సర్పంచులు మాధవి, మాణిక్యరెడ్డి, దీపికారెడ్డి, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, విట్టల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు



రూపేశ్, ఎస్పీ

సంగారెడ్డి: సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రూపేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంప్రదాయాలను గౌరవిస్తేనే శాంతియుత వాతావరణం నెలకొంటుందని చెప్పారు. ప్రజలు వదంతులు నమ్మొద్దని, వాట్సాప్ గ్రూపులలో వైరల్ అయ్యే మెసేజ్‌లు, వీడియోలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాస్తవాలు తెలుసుకోకుండా మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయకూడదని హెచ్చరించారు. అల్లరి మూకల పని పట్టడానికి గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

పటాన్‌చెరు : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము ప్రధాన రహదారిపై ఏర్పడిన మురుగునీటి సమస్యకు శాశ్వత పరి ష్కారం చూపబోతున్నట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. బుధ వారం చందానగర్ కార్పొరేటర్ మంజులతో కలిసి మురుగును పరిశీలించారు. బంధం కొమ్ము నుంచి వచ్చే మురికి నీటిని చందానగర్ ప్రధాన కాలువకు అనుసంధానం చేస్తే సమస్య ఉండదని ఎమ్మెల్యేకి సూచించారు. త్వరలోనే ఆ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలి పారు. కార్యక్రమంలో కమిషనర్ జ్యోతి రెడ్డి, కౌన్సిలర్ బిజిలి రాజు పాల్గొన్నారు.

ఘనపూర్‌కు సింగూరు నీటి విడుదల

పుల్‌కల్(అందోల్) : సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆయకట్టుకు సాగునీటిని జలవి ద్యుత్ కేంద్రం గుండా విడుదల చేశారు. ఘన పూర్ ఆనకట్ట తక్కువ సామర్థ్యంతో ఉండటంతో ప్రతీ సంవత్సరం దశల వారీగా నీటిని విడుదల చేస్తారు. ఇందులోభాగంగా బుధవారం డ్యాం నుంచి 0.30 టీఎంసీల నీటిని వదలడంతో జెన్‌కో అధికారులు జనరేటర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



నారాయణఖేడ్‌లో నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్రూం ఇళ్లు

ఎదురుచూపులు.. ఎన్నేళ్లు?

- కొనసాగుతున్న డబుల్ ఇళ్ల నిర్మాణాలు
- కొత్త ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు
- అర్హులకు అందించాలని వేడుకోలు

రాష్ట్రంలో పేదల సొంతింటికలను సాకారం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పడకల ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. కొన్నేళ్ల క్రితం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. మరికొన్ని పూర్తైనా కేటాయింపులో జాప్యం జరిగింది. కొత్త ప్రభుత్వమైనా చొరవచూపి నిర్మాణాలు పూర్తి చేసి గూడులేని వేలాది మంది నిరు పేదలకు పక్కా ఇళ్లు అందిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

- నారాయణఖేడ్

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డబుల్‌బెడ్రూం ఇళ్లపై ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ మేరకు డబుల్ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయలేకపోయింది. నారాయణఖేడ్ మండలంలోని జూకల్ శివారులో 795 ఇళ్లు విడతల వారీగా మంజూరయ్యాయి. 2017లో మొదటి విడత 130, అరు నెలల తర్వాత 300, మిగతావి ఏడాదిలోపు మంజూరు చేశారు. వీటి నిర్మాణాలు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా నత్తనడకన సాగాయి. ఏళ్లుగా నివాసాలు లేని పేదలు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. చాలా మంది కార్యాలయాలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అందుబాటులోకి 610 ఇళ్లు

జూకల్ శివారులో 795 డబుల్‌బెడ్రూం ఇళ్లలో 130 పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. 180 నివాసాల పేయింటింగ్ పూర్తయ్యింది. మరో 300 ఇళ్లలో చిన్నచిన్న పనులు చేపట్టాల్సి ఉంది. రెండు నెలల్లో 610 నివాసాలు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.04లక్షల చొప్పున సుమారు రూ.40కోట్లతో డబుల్‌బెడ్రూం నిర్మాణాలు సాగుతున్నాయి. నారాయణఖేడ్ పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పలుమార్లు ఎంపిక జాబితాను విడుదల చేసినా ఇళ్లను కేటాయించలేదు. అయితే ఈ జాబితాలో చాలామంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా అసలైన అర్హులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించాలని కోరుతున్నారు.

ప్రైవేట్ డ్రైవర్ల ఆశ

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సుర్‌పూర్ శివారులో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం (2013లో) రూ.7లక్షలు వెచ్చించి ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి 158మంది ప్రైవేట్ డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది. కొందరు బేస్‌మెంట్లు కూడా నిర్మించుకున్నారు. కల్హేర్ మండలం మార్డిలో 76 మంది, పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లిలో 24మంది షెడ్యూల్ కులాల వారికి ప్రభుత్వ స్థలాల్లో పట్టాలు ఇచ్చారు. మోడల్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.2.86కోట్లను మంజూరీ చేసింది. అనంతరం 2014లో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. 2018లో డ్రైవర్స్ కాలనీకి చెందిన డ్రైవర్లు ఈ విషయాన్ని నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మంజూరీ చేస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. కాగా ఈ స్థలాలను తిరిగి డ్రైవర్లకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిజాంపేట్‌లో ప్రభుత్వం స్థలం కొనుగోలు చేసి పట్టాలు ఇవ్వగా ధరణిలో ప్రైవేట్ వ్యక్తుల పేర్లు రావడంతో వేసుకున్న గుడిసెలు తొలగించడంతో పేదలు నిరాశ్రయులయ్యారు. ఇలా ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్రూంల కోసం లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రెండు నెలల్లో 610 ఇళ్లు పూర్తి



జూకల్ శివారులోని 610 డబుల్‌బెడ్రూం ఇళ్లు రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయి. ఇందులో 130 పూర్తవగా, 180 ఇళ్లకు రంగులు వేశారు. 300 నివాసాల్లో చిన్న చిన్న పనులు చేపడుతున్నారు. త్వరలో పూర్తి చేస్తాం.

– రాకేష్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ, నారాయణఖేడ్

అర్హులకు కేటాయిస్తాం..



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పాదర్శకంగా అర్హులకు కేటాయిస్తాం. నిరుపేదలకే ఇవి దక్కాలి. స్థలాలు కూడా నిజమైన అర్హులకు అందేలా చూస్తాం. వీటి వివరాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు సూచించా.

– డాక్టర్ సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి దామోదర రాజనర్సింహ



విద్యార్థితో మాట్లాడుతున్న మంత్రి దామోదర

సంగారెడ్డి: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం చౌటకూర్ మండలం శివంపేట ప్రభుత్వ పాఠశాలలో 'ఎనీమియా ముక్త్ తెలంగాణ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఏ ఒక్క విద్యార్థి రక్తహీనతతో బాధపడకూడదని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రతిరోజూ 100 నుంచి 300 మంది విద్యార్థులకు టెస్టులు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హిమోగ్లోబిన్ లెవెల్స్ పెరగడానికి ఆహారంలో ఐరన్ ఉండేలా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ అందించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ మాట్లాడుతూ మనిషికి రక్తం ఎంత ముఖ్యమో.. రక్తానికి హిమోగ్లోబిన్ అంతే ప్రధానమని అన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో రక్తహీనత సమస్య లేకుండా నివారిద్దామని పిలుపునిచ్చారు. రక్తహీనతతో బాధపడే బాలికలు పెద్దయ్యాక గర్భ సమయంలోనూ ఇబ్బంది పడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ గాయత్రీ దేవి, ఆర్డీఓ పాండు, పోలీస్ అధికారులు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ ఈశ్వరీరాణి, దుర్గారెడ్డి, దశరథ్, రాజిరెడ్డి, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్



పండ్లు పంపిణీ చేస్తున్న కమిషనర్

సంగారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్ కలెక్టర్ క్రాంతితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డులు, ఆపరేషన్ థియేటర్లను వారు పరిశీలించారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మెటర్నటీ వార్డులో పండ్లు పంపిణీ చేశారు. ఓపీ కౌంటర్లను పెంచాలని సూపరింటెండెంట్ అనిల్ కుమార్‌కు కమిషనర్ సూచించారు. ఆస్పత్రి సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మెడికల్ కళాశాల ఆవరణలో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, మహిళా శిశు సంక్షేమ అధికారి సంధ్యారాణి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జడ్జి జె.హనుమంతరావు



మాట్లాడుతున్న జడ్జి హనుమంతరావు

కంది(సంగారెడ్డి): బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జె.హనుమంతరావు అన్నారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని కాశిపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాలికలు గృహహింస, బాల్య వివాహ నిషేధం, పోక్సో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయపరమైన సహాయం కోసం సంగారెడ్డి న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, బాలల పరిరక్షణ అధికారి రత్నం, అధికారులు లింగం, రామకృష్ణ, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ యాదగిరి పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టర్ క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : పదో తరగతి పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. 55 రోజుల్లో ఎలా చదవాలనే దానిపై సలహాలు సూచనలు ఇవ్వాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. అలాగే టీఎన్జీఓ భవన్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 20 బీసీ వసతి గృహాలలో చదువుతున్న 209 మంది టెన్త్ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు.

బూచినెల్లిలో అభివృద్ధి పనులు భేష్

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్



కంపెనీ ప్రతినిధులతో కలిసి గ్రామంలో పర్యటిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి గ్రామంలో సీఐఈ ఆటోమోటివ్ కంపెనీ తరఫున చేపట్టిన అభివృద్ధి పనులు సంతృప్తికరంగా ఉన్నట్లు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో కంపెనీ వారు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు రూ.51లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం అడిషనల్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంపెనీ ప్రతినిధులు గ్రామంలో గుట్టపై ఉన్న పాఠశాలకు మెట్లను నిర్మించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ భారతమ్మ, కంపెనీ ప్రతినిధులు వినాయక కడస్కర్, చంద్రజిత్ సర్దార్, పంచాయతీ కార్యదర్శి శృతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నియంత్రిద్దాం



మాట్లాడుతున్న ఎంవీఐ రాజా మొహ్మద్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంవీఐ (మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) రాజా మొహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీహెచ్‌ఈఎల్ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రహదారి భద్రత నియమాలను పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, ఫోన్‌లో మాట్లాడ వద్దని తెలిపారు. మితిమీరిన వేగంతో ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. కారు నడిపేవారు తప్పక సీట్ బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తత

- కాషాయం జెండాలు తొలగించారని రామ భక్తుల ఆందోళన



దౌల్తాబాద్ గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్న రామభక్తులు

హత్నూర(సంగారెడ్డి): భవ్య రామ మందిర నిర్మాణం సందర్భంగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మూడు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీరాముడి పల్లకీపై కాలి బూటు వేయడంతో రామ భక్తులు భగ్గుమన్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. బుధవారం గ్రామంలో కట్టిన కాషాయం జెండాలను తొలగించడంతో పంచాయతీ కార్యాలయం ఎదుట రామభక్తులు ఆందోళనకు దిగారు. జెండాలను ఎందుకు తొలగించారని పంచాయతీ సిబ్బంది, పోలీసులను నిలదీశారు. ఎస్సై ఆదేశాల మేరకే వాటిని తీసివేసినట్లు ఈఓ బాలరాజ్ వివరించారు. ఈ సందర్భంగా రామాలయం, శివాలయం వద్ద తొలగించిన కాషాయం జెండాలను తిరిగి ఏర్పాటు చేయాలని రామభక్తులు డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని వాటిని మళ్లీ యథాస్థానంలో ఉంచడంతో ఆందోళన విరమించారు.

బైక్ ర్యాలీ.. దుకాణాలు బంద్

పల్లకీపై బూటు విసిరిన సమయంలో ఓ దుకాణం దగ్ధం చేశారనే ఆరోపణలతో దౌల్తాబాద్‌కు చెందిన పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న రామభక్తులు నిరసగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు పెద్ద ఎత్తున పికెటింగ్ ఏర్పాటు చేశారు. గల్లీగల్లీకి పెట్రోలింగ్ నిర్వహిస్తూ జనాలు గుంపులుగా ఉండకుండా చూశారు.

మనోభావాలు దెబ్బతీయొద్దు

జిన్నారం(పటాన్‌చెరు): హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు హెచ్చరించారు. దౌల్తాబాద్‌లో జరిగిన ఘటనలో ముగ్గురు రామభక్తులను పోలీసులు అరెస్టు చేసి విచారణ కోసం బుధవారం జిన్నారం పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంఘాల నాయకులు పీఎస్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. రఘునందన్ రావు, బీజేపీ నేత మురళీ యాదవ్ కూడా అక్కడకు చేరుకుని డీఎస్పీ, సీఐలతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా రామ భక్తులను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. విచారణకు తాము పూర్తిగా సహకరిస్తామని, తప్పుడు కేసులు పెడితే మాత్రం ప్రతి ఘటన తప్పదన్నారు. సొంత పూచీకత్తుపై ముగ్గురిని ఇంటికి పంపారు. దీంతో నాయకులు ఆందోళన విరమించారు.

గొల్ల కురుమలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న నాగేష్

సంగారెడ్డి: వచ్చే ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ సీటును అన్ని రాజకీయ పార్టీలు గొల్ల కురుమలకు కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నాగేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ ఫోర్త్ క్లాస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల జనాభా ఉన్న గొల్ల కురుమలకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అనంతరం జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తరపున తెలంగాణ ఉద్యమకారుడు బీసీ నేత బీరయ్య యాదవ్‌కు మెదక్ ఎంపీ టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్, కృష్ణయ్య, అనంతయ్య, దశరథ్, మాణయ్య, రాములు, భూమయ్య పాల్గొన్నారు.

ఐడియా అదుర్స్..!



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. మండల పరిధి జీర్లపల్లి, బోరే గ్రామాల మధ్యలో రోడ్డు పక్కన వేసిన శనగ పంటను అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు రైతు వినూత్నంగా ఆలోచించాడు. పంట చుట్టూ ఖాళీ వాటర్ బాటిళ్లను ఏర్పాటు చేశాడు. గాలి వీచినప్పుడు వాటి నుంచి వచ్చే శబ్ధానికి జంతువులు బెదిరి పోయే అవకాశం ఉంటుందని ఇలా ఏర్పాటు చేశాడు.

- ఝరాసంగం(జహీరాబాద్)

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాన్నాల కుమార్


కార్మికులతో మాట్లాడుతున్న కుమార్

గజ్వేల్ : పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాన్నాల కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఎమ్మార్పీఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి వెంకటేశ్ మాదిగ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాన్నాల కుమార్ మాదిగ మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్‌లో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర గొప్పదని తెలిపారు. వారి శ్రమను గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

టీఎఫ్‌పీఏ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న బన్సీలాల్

గజ్వేల్: తెలంగాణ ఫ్లెక్స్ ప్రింటర్ అసోసియేషన్ (టీఎఫ్‌పీఏ) 2024 డైరీని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఐవోసీలో గల ఆర్డీవో కార్యాలయంలో టీఎఫ్‌పీఏ గజ్వేల్ అధ్యక్షుడు షేర్ల నారాయణ అధ్యక్షతన బుధవారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎఫ్‌పీఏ సభ్యులు శ్రీకాంత్, అనిల్, హనుమాన్ దాస్, శేఖర్, హరిబాబు, రేఖ, కరుణాకర్, సునీల్, నవీన్, వెంకట్‌గౌడ్, నర్సింలు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీ, పిల్లలు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. పటాన్ చెరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సునీల్ కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీన సునీల్ భార్య మంజుల వాణి, ఇద్దరు పిల్లలు వేద్విక్ సాయి(6), పరిమిత(8) తీసుకొని సంగారెడ్డిలో ఉండే సోదరుడి వద్దకు వెళ్తానని చెప్పింది. భర్త సునీల్ పటాన్‌చెరు బస్టాండ్ వరకు వెళ్లి వారిని వదిలేసి వచ్చాడు. కొద్దిసేపటికి సునీల్ మంజులవాణికి ఫోన్ చేయగా సోదరి ఇంటికి చేరుకున్నానని చెప్పింది. తిరిగి సాయంత్రం ఫోన్ చేయగా స్విచ్ఛాప్ వచ్చింది. అనుమానం వచ్చిన సునీల్ బామ్మర్ది గణేశ్‌కు ఫోన్ చేసి అడుగగా రాలేదని చెప్పాడు. భార్య, ఇద్దరు పిల్లల కోసం సునీల్ కుమార్ స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. వారి అదృశ్యంపై మంగళవారం రాత్రి సునీల్ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

హుస్నాబాద్‌రూరల్: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన హుస్నాబాద్ మండలం కూచనపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాటూరి రవి (48) వృత్తి రీత్యాలో బుధవారం ఉదయం కల్లు గీసేందుకు వెళ్లాడు. తాటి చెట్టు పైకి వెళ్లే క్రమంలో మోకు జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ఆస్పత్రిలో హన్మకొండ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ రవి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడికి భార్య భారతవ్వ, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని సర్పంచ్ తోడేటి రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు.

సరిహద్దు దాటుతున్న సబ్సిడీ బియ్యం

- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పెద్ద మొత్తంలో నిల్వలు
- వాహనాల్లో పక్క రాష్ట్రాలకు తరలిస్తున్న వైనం
- ప్రభుత్వ ఆశయానికి తూట్లు
- పట్టించుకోని అధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా వాటిని రాష్ట్ర సరి హద్దులను దాటిస్తున్నారు. పేదల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి బయటి మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే, పలు ప్రాంతాల్లో వ్యాపారులు రేషన్ బియ్యంను సేకరించి రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి జహీరాబాద్ మీదుగా కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– జహీరాబాద్ టౌన్


జహీరాబాద్ చెక్‌పోస్టు వద్ద రేషన్ బియ్యం లారీలను పట్టుకున్న డీఎస్పీ రఘు, పోలీసులు

దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదలు పస్తులుండరాదనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నాయి. కానీ.. ప్రభుత్వ ఆశయానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో కర్నాటక, మహారాష్ట్ర ఉండగా కొంత మంది వ్యాపారులు రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వ్యాపారులు రేషన్ బియ్యంను సేకరించి రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేస్తున్నారు. ఈ బియ్యాన్ని పెద్ద మొత్తంలో లారీలో లోడ్ చేసుకొని జహీరాబాద్ మీదుగా కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

ఇళ్లనే గోదాంలుగా మారుస్తూ..

జహీరాబాద్ నియోజకవర్గంలో వ్యాపారులు ప్రజలు, రేషన్ డీలర్ల నుంచి బియ్యాన్ని సేకరించి గోదాంలకు తరలిస్తారు. పెద్ద ఎత్తున నిల్వలు పేరుకున్న తర్వాత లారీల్లో రాష్ట్ర సరిహద్దులు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు ఇళ్లనే గోదాంలుగా మారుస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పక్కా సమాచారంతో దాడులు చేసి గోదాంలలో నిలువ ఉంచి క్వింటాళ్ల కొద్ది బియ్యాన్ని పట్టుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బియ్యం సీజ్ చేసి కేసులు పెట్టినా దందా ఆగడం లేదు. రేషన్ బియ్యం దందా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


హోతి(బి) గ్రామంలో నిల్వ ఉంచిన బియ్యం(ఫైల్)

ఇటీవల పట్టుబడ్డ బియ్యం..

- ఈ నెల 21న జహీరాబాద్ పట్టణం నుంచి కర్నాటకకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 10 టన్నుల రేషన్ బియ్యాన్ని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.
- రాష్ట్ర సరిహద్దులో మార్చి 9న పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్న 249 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు.
- జహీరాబాద్ మండలంలోని హోతి(బి) గ్రామంలో నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల బియ్యం బస్తాలను జూలై 7వ తేదీన రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు.
- మాడ్గి చెక్ పోస్టు వద్ద జూలై 15న రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న 240 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అలాగే, ఆగస్టు 8న అక్రమంగా తరలిస్తున్న 230 క్వింటాళ్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు.
- సరిహద్దులో గల ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద జూలై 19న గుజరాత్‌కు తరలిస్తున్న 232 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.
- ఇలా క్వింటాళ్ల కొద్ది బియ్యాన్ని పోలీసులు, పౌరసరఫరా శాఖ అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేశారు.

కేసులు పెడుతున్నాం

రేషన్ బియ్యం తరలిస్తున్న వారిని పట్టుకొని కేసులు పెడుతున్నాం. ప్రజలు కూడా వ్యాపారులకు బియ్యం అమ్మరాదు. బియ్యం నిల్వలు ఉంటే చర్యలు తీసుకుంటున్నాం. రేషన్ బియ్యం దందా జరుగుతుంటే వెంటనే తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, తహసీల్దార్

చర్యలు తీసుకుంటున్నాం



అక్రమ బియ్యం రవాణాను అరికట్టడానికి ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర సరిహద్దులో పోలీసు నిఘా పెంచాం. అక్రమంగా బియ్యం తరలిస్తే తనిఖీలు నిర్వహించి పట్టుకుంటున్నాం. ఇప్పటికే కేసులను నమోదు చేశాం. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు భవిష్యత్‌లో గట్టి చర్యలు తీసుకుంటాం.

– రాజు, సీఐ. జహీరాబాద్ టౌన్

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు ధరణి, అనూష

గజ్వేల్‌రూరల్: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు కేజీబీవీ (కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం)కి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు గజ్వేల్ కేజీబీవీ ప్రత్యేకాధికారి అనురాధ, పీఈటీ జ్యోతి తెలిపారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోని కేజీబీవీలో పదవ తరగతి చదువుతున్న కే.ధరణి, ఇంటర్మీడియట్ చదువుతున్న పీ.అనూష ఈనెల 25న ఉంచి 28 వరకు మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో జరిగే 36వ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు రాష్ట్ర బాలికల జట్టు తరపున పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను కేజీబీవీ ఉపాధ్యాయులు అభినందించారు.

29న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్



గజ్వేల్‌రూరల్: జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్ 29వ తేదీన నిర్వహించనున్నట్లు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కైలాసం బుధవారం పేర్కొన్నారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన బాల బాలికలు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, పాఠశాల బోనోఫైడ్‌తో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో జరిగే సాఫ్ట్ బాల్ సెలక్షన్స్‌కు ఉదయం 9:30 లోగా హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యదర్శి రేణుక, పీఈటీ వెంకటేశ్‌లతోపాటు 79819 23779 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాలు చేసుకోవద్దు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు రఘురాం, స్వాతిరెడ్డి, మురళీమోహన్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం
- జెండా ఊపి ర్యాలీని ప్రారంభం

సిద్దిపేటకమాన్: బాల్య వివాహాలు చేసుకోవద్దని, మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం బాలికలకు సూచించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేట కోర్టు కాంప్లెక్స్ నుంచి పాఠశాల బాలికలు, పోలీసు, కోర్టు సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించగా, రఘురాం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి ప్రతీ సంవత్సరం జాతీయ బాలికల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మురళీమోహన్, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, న్యాయవాదులు శివాజీ, మణి, వై. రాజేశ్వర్‌రెడ్డి, మంతూరి సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, పత్రి ప్రకాశ్, భరోసా, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

కలలు నిజం చేసుకోవాలి

హుస్నాబాద్: ఆడపిల్లలు దేశానికి గర్వకారణమని, బాలికలు రానున్న రోజుల్లో తల్లిదండ్రుల కలలు నిజం చేసేందుకు ఉన్నతమైన వ్యక్తులుగా తయారు కావాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కృష్ణతేజ్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి కృష్ణతేజ్ మాట్లాడుతూ.. బాలికలు కృషి, పట్టుదలతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్, ఉపాధ్యాయులు న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

పటాచెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మంది వాహనదారులకు కోర్టు జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 10 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల జరిమానా విధించారు. మరో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికీ రూ.10 వేల జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కారును ఢీకొట్టిన డీసీఎం

- ఇద్దరికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): కారును వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. త్రీ టౌన్ సీఐ భాను ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన మేర్గు కృష్ణతోపాటు మరో నలుగురు కలిసి కారులో బుధవారం సిద్దిపేటలో మంత్రి కొండా సురేఖను కలవడానికి వెళ్తున్నారు. దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న కారును వెనుకాల డీసీఎం ఢీకొట్టింది. దీంతో కారు డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న జ్యోతి, శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మిగితా వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. డ్రైవర్ కృష్ణ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై భగవాన్‌చౌక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: అతిగా మద్యం సేవించి పడుకున్న చోటే మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కురిషిద్దీన్ కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుప్రియ (46) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కి వచ్చి ఫ్యాబ్రికేషన్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22వ తేదీన మద్యం సేవి ంచి ఇంటికి వచ్చి బయట పడుకున్నాడు. స్థానికంగా నివాసం ఉండే వారు అతడిని రూమ్‌కి తీసుకొచ్చి పడుకోబెట్టారు. 23వ తేదీన ఉదయం సుప్రియ లేవకపోవడంతో వెస్ట్ బెంగాల్ వాసులు వచ్చి చూడగా మృతి చెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


షేక్ ఇమ్రాన్ (ఫైల్)

తూప్రాన్: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వేగేటు సమీపంలో చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్(25) కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లాడు. బుధవారం బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతుకుతుండగా, రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కొత్త బైక్ రిజిస్ట్రేషన్‌కు వెళ్తుండగా..

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి


మల్లేశం (ఫైల్)

జోగిపేట(అందోల్): ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన జోగిపేటలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అక్సాన్‌పల్లి గ్రామానికి కొత్తగొల్ల మల్లేశం (34) బుధవారం ఉదయం అక్సాన్‌పల్లి నుంచి సంగారెడ్డి ఆర్టీఓ కార్యాలయానికి కొత్త బైక్ రిజిస్ట్రేషన్ నిమిత్తం వెళ్తున్నాడు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోకి రాగానే నారాయణ ఖేడ్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని అల్మాయిపేట వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రేగోడ్‌కు చెందిన బస్వయ్య బైకుపై జోగిపేట మీదుగా సంగారెడ్డికి వెళ్తున్నాడు. అల్మాయిపేట వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్వయ్యకు తీవ్ర గాయాలై రెండు కాళ్లు విరిగాయి. వెంటనే అతడిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కారు అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మల్లయ్య (ఫైల్)


చేర్యాల(సిద్దిపేట): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాడబోయిన మల్లయ్య (48) వ్యవసాయం చేస్తుంటాడు. ప్రతిరోజూ మాదిరిగానే బుధవారం ఉదయం పశువుల పాలు పితికేందుకు కుమారుడు రాజుతో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పాలు పితికి కుమారుడితో ఇంటికి పంపించాడు. రాజు పాలు కేంద్రంలో పోసి ఇంటికొచ్చినా.. తండ్రి మాత్రం బావి దగ్గరి నుంచి రాకపోవడంతో వెళ్లి చూడగా నీటి హౌజ్ పక్కన పడి ఉన్నాడు. అతడి చేతిలో విద్యుత్ వైరు పట్టుకొని కనిపించాడు. రాజు పక్క పొలంలో ఉన్న గర్నెపల్లి కిషన్‌ను పిలువగా అప్పటికే చనిపోయాడు. మృతుడి భార్య సాయవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఓటు.. శాసించుమా

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- విస్తృత ప్రచారానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు
- జిల్లాలో 14,10,672 మంది ఓటర్లు
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

సంగారెడ్డి టౌన్ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో ఓటరుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. తన ఓటు హక్కుతో శాసించగల శక్తి ఉంది. పార్లమెంట్, అసెంబ్లీలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఎంతో విలువైన ఓటు హక్కు ఓ వజ్రాయుధం. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు అనే పాశుపతాస్త్రంతో శాసించగలిగే హక్కును రాజ్యాంగం కల్పించింది. ఉత్తమమైన నాయకులను ఎన్నుకోవాలన్నా, అక్రమార్కులు, అవినీతిపరులను గద్దె దించాలన్నా ఓటు ప్రజల చేతిలో ఉన్న అస్త్రం! అందుకే ఓటు హక్కును అందరూ బాధ్యతగా.. ప్రతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని కర్తవ్యంగా భావించాలి. నేడు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

నమోదు, సవరణ నిరంతరం



భారత ఎన్నికల సంఘం దేశంలోని అర్హులైన పౌరులందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. అంతేకాక ఓటర్ల భాగస్వామ్యం పెంచేందుకు వారి బాధ్యతలు గుర్తు చేస్తూ కొత్తగా ఓటరు నమోదు, జాబితా సవరణ, గుర్తింపు కార్డుల పంపిణీని నిరంతరం చేపడుతోంది. జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 14,10,672 మంది ఉండగా అందులో 6,99,326 మంది మహిళలు, 7,11,219 మంది పురుషులు ఉన్నారు. జిల్లాలో యువత ఓటర్లే కీలకం కానున్నాయి. 18 నుంచి 19 ఏళ్ల వారీగా ఓటర్ల వివరాలు లెక్క తీయగా 40,379 మంది ఉన్నారు.

ఓటరు దినోత్సవం ఇలా..


ప్రజాస్వామ్యంలోని ఎన్నికల ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2011 నుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తూ ఓటర్లలో చైతన్యానికి కృషి చేస్తోంది. తొలి నాళ్లలో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ జరుగగా, తర్వాత ఈవీఎంలు, ఆపై వీవీ ప్యాట్లను తీసుకొచ్చారు. తద్వారా ఓటు ఎవరికి వేశారో తెలుసుకునే వీలు కల్పించారు. అంతేకాక ఈవీఎం యంత్రంలో నోటా బటన్ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోటీ చేసే వారెవరూ నచ్చలేదని చెప్పడం సాధ్యమైనది.



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి (ఫైల్)

అవగాహన కార్యక్రమాలు

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు నమోదుపై జిల్లావ్యాప్తంగా ఓటరు చైతన్య రథాల ద్వారా ఓటు ప్రాధాన్యంపై అవగాహన కలిపిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటు నమోదులో జిల్లా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లను ఓటర్ జాబితాలో చేర్చారు. యువ ఓటర్లు దరఖాస్తు చేసుకునే విధానం, ఓటర్లంతా నచ్చిన వారికి ఓటు వేసి ఎన్నుకోవడం, తదితర అంశాలపై పాటలు, ప్రసంగాల ద్వారా కళాకారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో యువత ఓటరుగా తమ పేరును నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ చిత్రం

వచ్చే ఎన్నికల్లో ఓటు వేస్తా..



ఇటీవలె ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటరుగా నా పేరును నమోదు చేసుకున్నా. వచ్చే సాధారణ ఎన్నికల్లో నా ఓటును వినియోగించుకుంటా.. సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునేందుకు నా ఓటు ఉపయోగపడుతుందంటేనే చాలా సంతోషంగా ఉంది.

– సాయి కిరణ్ గౌడ్, విద్యార్థి

అవగాహన కల్పిస్తున్నాం



18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును తప్పనిసరిగా విని యోగించుకోవాలి. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ప్రచార రథాన్ని ప్రారంభించాం. కళాకారులు ప్రచార రథాలపై ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నాం.

– వల్లూరి క్రాంతి కలెక్టర్, సంగారెడ్డి